# కౌన్ బనేగా సుందరి పతి

-కోట ఇందిర

సుందరి అర్వై అయిదవ పెళ్లిచూపులు విజయవంతంగా 'ఢమాల్' మన్నాయి.

''ఏం... సుందరి! సెంచరీ కొట్టేదాకా పెళ్లి చేసుకోవా?'' అంటూ సుందరిని మేనత్త వరసయ్యే ఆమె బుగ్గలు నొక్కుకుంటూ వగలుపోయింది.

''అమ్మా! సుందరి ఇలాగైతే మన ఆస్తంతా నీ పెళ్లిచూపులకే కరిగిపోతుంది తల్లీ. ఆ తరువాత నీకు నచ్చిన సంబంధం వచ్చినా వాళ్ళడిగిన కట్నం ఇచ్చి నీ పెళ్లిని చేయలేను తల్లీ...చేయలేను'' అని పైపంచెతో కళ్లనీళ్ళు అద్దుకుంటూ సెంటిమెంట్‌గా తన నిరసన తెలియజేసాడు సుందరి తండ్రి రఘురామయ్య.

''సుందరీ! నా బంగారు తల్లివికదూ. నీ మనసులో ఏముందో కాస్తంత నాకైనా చెప్పవూ? సినిమాల్లో బి.సరోజ, కాంచనమాలల్లా కులం తక్కువవాడినో, ఆస్తి తక్కువవాడినో నువ్వు ప్రేమించినా నీకేం భయంలేదు. వాడెంత తలమాసినవాడైనా సరే నేను మీ నాన్నా నెత్తిన రెండు మొట్టికాయలు వేసి మరీ ఒప్పించి నువ్వు కోరుకున్న మొగుడికే నిన్ను కట్టబెడతాను. ఆ పూచీ నాది'' అంటూ కళ్లజోడు సవరించుకుంటూ సుందరి చెవిలో అభయమిచ్చింది సుందరి బామ్మ వర్ధనమ్మగారు.

''నీకిదేం మాయరోగమే? నీ ఈడు పిల్లలంతా హాయిగా పెళ్లిళ్ళు చేసుకుని పిల్లాపాపలతో చక్కగా సంసారాలు చేసుకుంటుంటే నువ్వు మాత్రం తగుదునమ్మా అంటూ ఇంకా పెళ్లిచూపుల చాపెక్కుతున్నావ్. అసలు పెళ్లికొడుకులని ఆ గదిలోకి తీసుకెళ్లి ఏం చేస్తున్నావ్? ఆ గదిలోంచి బయటకు రావడం ఆలస్యం వెనక్కి తిరిగి చూడకుండా పారిపోతున్నారు'' అంటూ ఫైనల్‌గా సుందరిని ఆడిపోసుకుంది సుందరి తల్లి సత్యవతమ్మ.

సుందరి మాత్రం ఎవరికీ సమాధానం చెప్పకుండా అందరి వంకా ప్రశాంతంగా చూసింది. టీవీలో ఇండియా, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ అంత టెన్షన్‌గా అందరూ అటెన్షన్‌లో సుందరి సమాధానం కోసం ఎదురుచూడసాగారు.

''మీరు ఎన్ననుకున్నా నా పెళ్లి నా ఇష్టం. నేను అందరిలాంటి ఆడపిల్లని కాను. నాకు నచ్చిన రీతిలోనే నా మొగుణ్ణి ఎంచుకుంటాను'' అంటూ చాలా కఠినంగా రైల్వేస్టేషన్ అనౌన్సర్‌లా తన నిర్ణయాన్ని మూడు భాషల్లోనూ అందరికీ తెలియజేసింది.

''పోనీ నీకెలాంటి మొగుడు కావాలో చెప్పవే! మాకు పెళ్లికొడుకుల్ని వెతికే శ్రమ తగ్గుతుంది. అలాంటివాడినే వెతుకుతాం'' అన్నాడు అప్పటివరకూ ప్రేక్షకపాత్ర వహించిన సుందరి మేనమామ బంగార్రాజు.

''అది మాత్రం చెప్పను'' అంటూ చరచరా తన గదిలోకి వెళ్లిపోయింది సుందరి.

''స్టోరీ, స్క్రిప్ట్ లేకుండా సినిమా షూటింగ్ మొదలుపెట్టినట్లుంది'' అన్నాడు బోసుబాబు.

బోసుబాబు బంగార్రాజు కొడుకు. అతను ఈమధ్యనే సినిమాల్లో హీరో అయిపోవాలని తెగ ఇదిగా హైదరాబాద్‌లో కష్టపడుతున్నాడు. మొత్తానికి సుందరి పెళ్లి ఇంగ్లీషు పేపర్లో క్రాస్‌వర్డ్ పజిలంత కఠినంగా మారింది. అందరూ ఒక్కసారిగా భారంగా నిట్టూర్చారు.

• • •

సుందరికి ఇరవై అయిదేళ్ళు. డిగ్రీ పూర్తి చేసింది.


మరగకాచిన పాలమీద మీగడలా అందం మందంగానే వుంటుంది. గుండ్రని మొహం, పిరుదులు దాటిన జడ, ఎత్తు, దానికి తగ్గ లావు, వెరసి సినిమా స్టార్లకి ఏమాత్రం తీసిపోదు.

ఆ ఊరిలోనూ, కాలేజీలోనూ సుందరిని లవ్వులో పడేద్దామని చాలామంది కుర్రకారు మహా బాగా ట్రై చేసారు. సుందరి పుణ్యమా అని ఊరి బస్టాపు దగ్గర పాకలో టీ అమ్మే నాయరు మాత్రం రెండిళ్ళకు ఓనరయ్యాడు. ఇంత బ్యాగ్రౌండ్ వున్న సుందరికి ఇంకా ఎందుకు పెళ్లి కావడంలేదో ఆ ఊరిలో ఎవరికీ అర్థం కావడంలేదు. సుందరి తండ్రి దీర్ఘంగా ఆలోచించాడు. ఈ సమస్యను లక్ష్మిరాజ్యం మాత్రమే పరిష్కరించగలదు అనిపించింది.

లక్ష్మిరాజ్యం చిన్నప్పటినుంచీ సుందరికి స్నేహితురాలు. చాలావరకూ ఇద్దరి మధ్యన ఏ విషయంలో దాపరికం లేదు. లక్ష్మిరాజ్యం ఆర్నెల్లక్రితమే ఓ ఇంజనీరుని పెళ్లి చేసుకుని బెంగుళూరుకు వెళ్లింది.

తన ఆలోచన భార్యతో చర్చించాడు. అదే మంచి పని అని ఆమె కూడా భుజం తట్టింది. దాంతో లక్ష్మిరాజ్యంకి విపులంగా ఉత్తరం రాసి పడేసాడు. తాత్కాలికంగా సుందరి పెళ్లి విషయం లక్ష్మిరాజ్యం రెప్లైమీద వేసి ఊపిరి పీల్చుకున్నాడు.

ఈ విషయం తెలియని సుందరి ఆ మర్నాడు ఓ అరడజను పేజీల ఉత్తరం రాసి లక్ష్మిరాజ్యంకి కొరియర్‌లో పోస్టు చేసింది. ఓ వారంరోజులకి లక్ష్మిరాజ్యం దగ్గర నుండి సుందరి తండ్రికి రెప్లై వచ్చింది. మరో పదిహేను రోజులకి లక్ష్మిరాజ్యం దిగిపోయింది. రైల్వేస్టేషన్‌కే వెళ్లి కరువుదీరా ఏడ్చాడు సుందరి తండ్రి.





## సరైన సమయం

ఒకసారి ఒక భక్తుడు గ్రీకు తత్త్వవేత్త డియోజెనస్ దగ్గరకు వెళ్లి ''రాత్రి భోజనానికి సరైన సమయం ఏది?'' అని అడిగాడు. దానికి అతడు 'నువ్వు ధనవంతుడివైతే నీ ఇష్టం వచ్చినప్పుడు, దరిద్రుడవు అయితే ఎప్పుడు దొరికితే అప్పుడు'' అని జవాబు చెప్పాడు.

## రష్యా భాషలోకి...

రష్యా భాషలో రచించబడిన 'ఓరియంటల్ రిలిక్స్' అనే గ్రంథం సోవియెట్ యూనియన్‌లో ప్రచురించబడింది. దీనిలో కాళిదాసు, విద్యాపతి, భర్తృహరి, అమీర్‌ఖుస్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్ మొదలైన సుప్రసిద్ధ కవుల రచనలు కూడా చేర్చబడ్డాయి.

## 6వేల సంవత్సరాల క్రిందటి రొట్టె

స్విట్జర్లాండ్‌లోని పురావస్తు శిల్ప శాస్త్రజ్ఞులు 6వేల సంవత్సరాల పూర్వం కాల్చబడిన రొట్టెను కనుగొన్నారు. ఇన్నేళ్ళపాటు భూగర్భంలో ఉన్న ఈ రొట్టె శిలగా మారిపోయింది.

## రోబోటుకు ఈగకళ్ళు

సోవియెట్ యూనియన్‌లో భౌతిక విజ్ఞానవేత్తలు రోబోట్‌ల కంటి నిర్మాణానికి మామూలు ఈగ కంటి మీద ఆధారపడ్డారు. కాంతికి సరిసమంగా చైతన్యత కలిగిన కొన్నివేల కణాలు వీటి కళ్ళల్లో వుంటాయి. ఈగ దృష్టి అతి నైపుణ్యంగా సర్వతోముఖంగా వుంటుంది. విజ్ఞాన శాస్త్రజ్ఞులు అతి చాకచక్యంగా వీటిని అనుకరించి రోబోటులలో ప్రత్యేకంగా ఈగవంటి కళ్ళను ఏర్పరిచారు.

- స్వాతి

''నేనిక్కడ ఓ ఇరవై రోజులుంటాను బాబాయ్. మరేం ఫర్వాలేదు. సుందరి పెళ్లి పప్పన్నం తినిగానీ వెళ్లను'' అంటూ హామీ ఇచ్చింది లక్ష్మిరాజ్యం.

''అంతా నీ చేతుల్లోనే వుందమ్మా. నువ్వేం చేయమంటే అదే చేస్తాను'' అంటూ సుందరి పెళ్లి భారం లక్ష్మిరాజ్యం నెత్తిన పూర్తిగా వేసి హాయిగా, గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడాయన.

''అలాగే! ఓసారి ఇంటికెళ్లి కనిపించి వస్తాను'' అంటూ కదిలింది లక్ష్మిరాజ్యం.

లక్ష్మిరాజ్యం ఊరిలోకి దిగిన విషయం భార్య చెవిన వేయడానికి ఇంటికి కదిలాడు. లక్ష్మిరాజ్యం వస్తున్నట్లు సుందరికి రాయనందువల్ల ఆమెకి మాత్రం తెలియదు. సాయంత్రానికి సుందరి వాళ్లింట్లో దర్శనమిచ్చింది లక్ష్మిరాజ్యం.

''ఉత్తరం బదులు నువ్వొచ్చావు'' అంటూ తన ఆనందం ప్రకటించింది సుందరి.

''అదిసరేగానీ ఎప్పుడూ మామూలు ఉత్తరాలే రాస్తావు. నీ పెళ్లి శుభలేఖ ఎప్పుడు పంపిస్తావే'' అంటూ తను వచ్చిన పని గురించి కూపీ లాగేందుకు నడుం కట్టింది లక్ష్మిరాజ్యం సిన్సియర్‌గా.

''పంపిస్తానులే'' అంది సుందరి కొంచెం నిరాసగా.

లక్ష్మిరాజ్యం సుందరితో మాట్లాడుతూనే ఆలోచనలో పడింది. సుందరి గదిలో చేసే గూడుపుఠాని ఏమిటో తెలిస్తేగానీ ఈ సమస్యని పరిష్కరించడం కుదరని పని. అందుకే గదంతా పరిశీలించసాగింది. మూడుగంటలు పరిశోధించినా పెళ్లికొడుకులను భయపెట్టేంత భయంకరమైన వస్తువులేవీ కనిపించలేదు.

''ఏమిటే నేను మాట్లాడుతుంటే నువ్వేదో ఆలోచిస్తున్నావు?'' అంటూ సుందరి వీపు మీద ఒక్క చరుపు చరచడంతో ఉలిక్కిపడింది.


''అబ్బే... ఏం లేదు'' అంటూ భళ్ళున నవ్వేసింది.

''ఏం మీ ఆయన మీదకి మనసు పోయిందా?'' అంటూ సుందరి ఉడికించింది. దాంతో మరో రెండు గంటలు తన సంసారం, తన మొగుడు గురించి కథలుగా వర్ణించి చెప్పింది లక్ష్మిరాజ్యం. ఈ దెబ్బతోనన్నా సుందరికి పెళ్లిమీద గాలి మళ్ళుతుందేమోనని ఆశగా. సుందరి ఓపిగ్గా అంతా విని కొన్ని పాయింట్లు గుర్తు పెట్టుకుంది. మర్నాడు లక్ష్మిరాజ్యం సుందరి ఇద్దరూ నూన్‌షోకి బయలుదేరారు.

''ఏం సినిమాకు వెళదాం'' అంది లక్ష్మిరాజ్యం చీర కుచ్చిళ్ళు సర్దుకుంటున్న సుందరితో.

''భీమారావ్ సినిమా 'రెండోమొగుడ' కెళదాం'' అంది సుందరి ఉత్సాహంగా.

''నీకు మొదటి మొగుడే రాలేదు. రెండోమొగుడికెందుకే'' నవ్వుతూ చురకంటించింది.




''వచ్చే టైమొస్తే వస్తాడులే. ఈలోపు మనం రెండో మొగుడు చూద్దాం'' అంది సుందరి లక్ష్మిరాజ్యం చురకలో వాడి, వేడి గమనించినా గమనించనట్టే.

ఇద్దరూ కలిసి ఆటోలో థియేటర్‌కి చేరుకున్నారు.

థియేటర్ నిండా చాలామంది జనం వున్నారు. వాళ్లల్లో రెండో మొగుడి కోసం (సినిమా) వచ్చింది చాలా మంది ఆడవాళ్లే.

''టిక్కెట్లు దొరకవేమోలేవే. ఇంకో సినిమాకెళదాం'' అంది లక్ష్మిరాజ్యం ఖాళీగా వున్న సినిమాకి వెళితే సుందరి గదిలో జరిగే గూడుపుఠాణి గురించి కూపీ లాగవచ్చునని.

''అంత భయపడక్కర్లేదు. టిక్కెట్లు దొరుకుతాయి'' అంటూ థియేటర్ లోపలకి కదిలింది సుందరి చకచకా.

కొంతమంది మగవాళ్ళు, ఆడవాళ్ళు ''నమస్తే మేడం... బాగున్నావా సుందరి?'' అంటూ సుందరిని పలుకరించారు. వాళ్ళందరికీ చిరునవ్వే సమాధానం. సరాసరి మేనేజర్ గదిలోకి నడిచింది. అయిదు నిముషాల తరువాత రెండు టిక్కెట్లు చేతపట్టుకుని లక్ష్మిరాజ్యం ముందు ప్రత్యక్షమైంది.

''మేనేజరు నీకు తెలుసా?'' అంది లక్ష్మిరాజ్యం సుందరి చేతిలో టిక్కెట్లు చూస్తూ.

''నేను భీమారావ్ ఫాన్స్‌కి స్టేట్‌వైడ్ సెక్రటరీని'' అంది సుందరి కొంచెం గర్వంగానూ మరికొంచెం గంభీరంగానూ.

ఆ మాటకి ఆశ్చర్యపోయినా సుందరి పెళ్లి విషయంలో ఏదో లింక్ దొరికినట్టు అనిపించింది లక్ష్మిరాజ్యంకి.

''భీమారావ్ అంటే అంతిష్టమా?'' అంది తన అనుమాన నివృత్తికోసం.

''చచ్చేంత ఇష్టం'' అంది సుందరి తన్మయత్వంగా కళ్ళు మూసుకుంటూ.

''అయితే భీమారావ్‌లాంటి వాడు నీకు మొగుడిగా కావాలన్నమాట'' అంటూ సుందరిని నెమ్మదిగా ముగ్గులోకి దించింది.

''ఛీ! పాడు... భీమారావ్ అంటే సినిమాలవరకే ఇష్టం. అంతేగానీ అలాంటివాడిని పెళ్లి చేసుకునేంత మూర్ఖురాలిని కాదు'' అంది సుందరి సీరియస్‌గా.

హతోస్మి! మళ్లీ కథ మొదటికొచ్చిందని డీలా పడిపోయింది లక్ష్మిరాజ్యం. సినిమా చూస్తున్నంతసేపూ సుందరి పెళ్లి విషయం గురించే సీరియస్‌గా ఆలోచించసాగిందామె.

హాలులో సినిమా చూస్తూనే భీమారావ్ జిందాబాద్ అని ఇరవైసార్లు, భీమారావ్ వర్ధిల్లాలి అని ముప్ఫైసార్లు అరిచి తన ఆనందం ప్రకటించింది సుందరి. ఈలవేసి, చప్పట్లుకొట్టి ఆమె ఉత్సాహానికి సహకరించారు కొంతమంది కుర్రకారు. భీమారావ్ డాన్సుని, ఫైట్లని పొగుడుతూ ఇంటికి చేరింది సుందరి. ఆ రాత్రి భోజనం చేసి ఇద్దరూ కలిసి మేడమీదకి చేరారు. కాసేపు భీమారావ్‌ని పొగడనిచ్చి సుందరి పెళ్లి విషయాన్ని కదిపింది 'స్నేహితుల మధ్య దాపరికాలు ఉండకూడదుకదవే' అంటూ ఓ గొప్ప ఎక్స్‌ప్రెషన్ ఇస్తూ. తల్లీదండ్రికి ఈ విషయం చెప్పకూడదని చేతిలో చెయ్యి వేయించుకుని నెమ్మదిగా

ఆ టాప్ సీక్రెట్ విప్పింది సుందరి. లక్ష్మీరాజ్యం కొండంత భారం దిగిపోయినట్లు ఫీలయింది.

• • •

సుందరి, లక్ష్మీరాజ్యం షాపింగ్‌కి వెళ్ళొచ్చేసరికి సుందరి తల్లి ''సుందరీ! నీకు పెళ్ళిచూపులు సాయంత్రం'' అంది. ''ఏ ఊరి సంబంధం?'' అంది ప్రక్కనేవున్న లక్ష్మీరాజ్యం. ''ఏ ఊరైతేనేం? ఏ పేరైతేనేం? దానికి నచ్చాలికదమ్మా?'' అంటూ నిట్టూర్పులు విడుస్తూ వెళ్ళిపోయిందామె. సుందరికి ఇంట్లో వాతావరణం తేడాపాడాగా కనిపించింది. ఇంతకు ముందు తనకి పెళ్ళిచూపులంటే తనకంటే ఇంట్లోవాళ్ళే టెన్షన్ పడేవాళ్ళు. పైపెచ్చు అందరూ 'ఈ సంబంధమన్నా ఒప్పుకోమ్మా' అంటూ తనని తెగ ఇదిగా బ్రతిమలాడేవాళ్ళు.

ఇప్పుడు ఎవ్వరూ తనవంక కన్నెత్తిచూడడంలేదు. పన్నెత్తి పలుకరించడంలేదు. ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు. అందరి మొహాల్లో ఈ సంబంధం ఖాయమైపోతుందన్న ధీమా కనిపిస్తోంది. ఈ విపరీతం ఏమిటో అర్థంకాలేదు సుందరికి. నెమ్మదిగా ఆమె అనుమానం లక్ష్మీరాజ్యం మీదకి మళ్ళింది.

''మీ అమ్మానాన్నకి నీ సీక్రెట్ చెప్పలేదు'' అంటూ సుందరి చేతిలో మళ్ళీ చేయివేసి మరీ హామీ ఇచ్చింది లక్ష్మీరాజ్యం. దాంతో కొంత ఊరట చెంది ఏదైతేనేం? తనకి నచ్చితేనేగా? పెళ్ళి చేసుకునేది అనుకుని హాయిగా కునుకుతీసింది సుందరి.

• • •

చిలకపచ్చ రంగు చీరలో మ్యాచింగ్ బ్లౌజుతో దగ్గరుండి సుందరి అందానికి మెరుగులు దిద్దింది లక్ష్మీరాజ్యం. మూడురోజుల క్రిందట చూసొచ్చిన రెండో మొగుడి సెకండ్ హీరోయిన్‌లాగా వయ్యారంగా నడుచుకుంటూ వచ్చి కూర్చుంది సుందరి.

మామగారు, అత్తగారు, ఆడపడుచుల ఇంటర్వ్యూలు పూర్తయ్యాక పెళ్ళికొడుకును పరిశీలనగా చూసింది. అరవై అయిదుసార్లు వేసిన పెళ్ళిచూపుల నాటకం స్క్రిప్ట్ అంతా సుందరికి మహా బాగా కంఠతా వచ్చేసింది. అందుకే ప్రామ్టింగ్ అవసరం లేకుండా ఎక్కడా తొణక్కుండా, బెణక్కుండా చకచకా సమాధానాలు ఇచ్చేసింది. ఇక పెళ్ళి కొడుకు ఇంటర్వ్యూ కూడా పూర్తయితే తన పర్సనల్ ఇంటర్వ్యూకి గదిలోకి పిలవవచ్చు తనని. పెళ్ళికొడుకు ఎర్రగా, బుర్రగా 'అందం'గానే వున్నాడు. అందంలో తనకి తగ్గ జోడీనే అనుకుంది సుందరి మనసులో.

''మీకు కరాటే వచ్చా?'' అడిగాడు మొదటి ప్రశ్నగా.

''రాదు'' అంది కొంచెం ఆశ్చర్యంగా.

సంగీతమొచ్చా, వంటలో ఏది బాగా చేస్తారులాంటి ప్రశ్నలు అడుగుతాడనుకుంది మరి.

''పోనీ షూటింగ్ వచ్చా?'' అన్నాడు రెండో ప్రశ్నగా.

''రాదు'' అంది కొంచెం నెమ్మదిగా మరింత ఆశ్చర్యంగా.

''పోనీ డ్రైవింగ్, రన్నింగ్‌లాంటివి'' అన్నాడు తను కొంచెం అసహనంగా.

''రావు'' అంది బేలగా తలూపింది సుందరి.

''హు'' అంటూ అసహనంగా హుంకరించాడు పెళ్ళికొడుకు. సుందరికి ఇంతకుముందు పెళ్ళిచూపులకి ఈ పెళ్ళిచూపులకి తేడా స్పష్టంగా అర్థమైంది.

ఇంతకుముందు కూర్చున్నంత ధీమాగా కూర్చోలేక టెన్షన్ ఫీలవసాగింది.

పెళ్ళిచూపులు అయిపోయాయన్నట్లు పెళ్ళికొడుకు కాలికున్న బూట్ల లేసులను బిగించుకోసాగాడు.

''బాబూ! మీకు అభ్యంతరం లేకపోతే అమ్మాయి మీతో ఓ అయిదు నిముషాలు మాట్లాడుతుంది'' అన్నాడు సుందరి తండ్రి అభ్యర్థిస్తున్నట్లుగా.

ఈసారి మరింతగా ఆశ్చర్యపోయింది సుందరి, తన తండ్రేనా ఈ మాటంటున్నదని. ''వైనాట్!'' అంటూ ఓ ఫోజిచ్చి గదిలోకి కదిలాడు పెళ్ళికొడుకు.

గదిలోకి వెళ్ళగానే నీటిలో మొసలిలా ధైర్యం పుంజుకుంది సుందరి. తలుపును గట్టిగా బిగించి పెళ్ళికొడుకు వైపు తిరిగింది. సుందరికి బహుశా కరాటే వచ్చేమోనని అనుమానంగా చూసాడు పెళ్ళికొడుకు.

''నేను మీకు నచ్చానా?'' అంది పైటచెంగు బొడ్లో దోపుకుంటూ సీరియస్‌గా.

''ఆ...'' అన్నాడతను భయం భయంగా.

''అయితే నేనడిగే ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానాలు చెబితేనే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకునేది'' అంటూ తన నిర్ణయాన్ని ఖచ్చితంగా తెలియజేసింది.

''అలాగే'' అంటూ తల ఊపాడతను కొంచెం భయం తగ్గి.

''అయితే మొదటి ప్రశ్న కాసుకోండి. మనిషి అంటే ఎవరు?

ఎ)మానవుడు. బి)మానవత్వం వున్నవాడు. సి)మనీ వున్నవాడు. డి)భార్య వున్నవాడు'' అంటూ ప్రశ్న సంధించి సమాధానం కోసం ఆతృతగా చూడసాగింది.

రెండు క్షణాలు ఆలోచించి ''డి'' అన్నాడతను.

''వెరీగుడ్... వెరీగుడ్'' అంటూ ఆనందంగా చప్పట్లు కొట్టింది సుందరి. అతని మొహంలో ఆనందం వెల్లివిరిసింది. అలా సుందరి అడిగిన ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానాలు చెప్పాడతను.

అతని విజయం వెనుక లక్ష్మీరాజ్యం హస్తం వుందని పాపం సుందరికి తెలియదు. ఆ పెళ్ళికొడుకు లక్ష్మీరాజ్యం వాళ్ళాయన స్నేహితుడని ఎవరూ చెప్పలేదు.

సుందరి తయారు చేసుకున్న క్వొశ్చన్ అండ్ ఆన్సర్ షీటును బోసుబాబు సాయంతో లీక్‌చేసి అతనికి అందించిందని అస్సలు తెలియదు.

సుందరి తన తెలివి తేటలకి తానే మురిసిపోయింది.

★

## యుక్తాముఖి కష్టాలు



యుక్తాముఖి కష్టాలు అన్నీ, ఇన్నీ కావండీ! ఎన్ని కష్టాలో. ఒకదాని వెనుక మరొకటి లైనుగా వస్తున్నాయట. ఆమధ్య ఆమె కారును దొంగిలించుకుపోయారు. తర్వాత వాళ్ళ నాయనమ్మ హాస్పటల్‌లో చేరింది సీరియస్‌గా ఉందని. ఆ తర్వాత ఇంట్లో దొంగలుపడి చాలా డబ్బు దోచుకున్నారు... అందుకే యుక్తా చాలా దిగులుగా వుంటోందిట. బోయ్‌ఫ్రెండ్ సలహామేరకు ఎవరో జ్యోతిష్కుడ్ని కలిస్తే ఇంటి తాళాలు మార్చమని శలవిచ్చాడుట. సో, ఇప్పుడు యుక్తా తాళాలు కొనే పనిలో వుందిట!

## నెలరోజులు ఒకే సినిమా చూస్తే...

ఒకే సినిమాని నెలరోజులపాటు లైన్‌గా ఎవరైనా చూడగలరా? నెవ్వర్. బట్.. కోకోకోలా యాడ్‌లో అమీర్‌ఖాన్‌తో నటించిన దివ్యపాలట్ తను నటిస్తున్న 'దిల్ ఢూండ్ తాహై' (మనసు వెతుకుతోంది) సినిమా రిలీజ్ అయ్యాక ప్రేక్షకుల మధ్యన కూర్చొని నెలరోజులపాటు కంటిన్యూగా చూస్తుందిట. అలా చూస్తే ప్రేక్షకుల రెస్పాన్స్ ఎలా వుందో తెలుసుకునే అవకాశం కలుగుతుంది. నా నటనలోని తప్పొప్పులు ఇలా స్వయంగా తెలుసుకుంటాను.. అని డిసైడయ్యిందిట. చూశారా! ట్రెండ్ ఎలా మారిందో?

- విరజ

